# కాణిపాకం వినాయకుడి సాక్షిగా...



మంగ మనసు మనసులో లేదు. నీళ్ళల్లో చేపను ఎత్తి గడ్డన పారేస్తే విలవిలలాడి నట్టు మనిషి తహతహ లాడిపోతూ ఉంది. కూర్చుంటుంది లేస్తుంది. గబగబ వీధిలోకి నడుస్తుంది. అక్కడ నిలబడుతుంది.

ఆ ఊళ్ళో నుంచి బయలుదేరిన కాలిబాట ఊరికీ, ఆ ఊరికి ఉత్తరంగా ఉండే కొండలకు మధ్య దూరాన్ని కొలిచే ప్రయత్నంలో పోతూ పోతూ ఆ కొండల్లో కోనల్లో కలిసిపోతూ ఉంది. మంగ .వీధిలో నిలబడి ఆ బాటవైపు చూపు ఆనినంత దూరం ఆశగా చూస్తుంది. చూస్తూ చూస్తూ ఉండగానే తల వాలిపోతుంది. ఒక నిట్టూర్పు విడుస్తుంది. మెల్లగా వెనక్కు తిరుగుతుంది. అడుగు మీద అడుగ్గా గుడిసెలోకి నడుస్తుంది. కుప్పగా కూలబడుతుంది — నడుములే విరిగిపోయినట్టు.

అది తలుపు ద్వారబంధం కూడా లేని గుడిసె. అవసరమయినప్పుడు నిలువెత్తు తడిక తలుపుగా మారుతుంది. ఆ గుడిసెలో కూర్చుంటే వీధిలో వస్తూపోతూ ఉండే వాళ్ళే గాదు - ఆ కాలిబాట మీద చాలా దూరంలో వస్తున్న వాళ్ళు కూడా కంటపడతారు. అయినా, మంగ స్తిమితంగా గుడిసెలో కూర్చోలేక పోతూ ఉంది. అంతలోనే లేస్తుంది. ఒక్క అడుగులో వీధిలో పడుతుంది. అక్కడ నిలబడి ఆ కాలిబాట వైపు కండ్లు చించుకొని చూస్తుంది. చూస్తూ ఉండగానే కండ్లు వాలిపోతాయి. తల వాలిపోతుంది. తల పగిలి పోతున్నట్లుగా రెండు కణతల్నూ రెండు బొటనవేళ్ళతో నొక్కి పట్టుకుంటుంది. నిట్టూరుస్తూ వెనక్కు తిరుగుతుంది.

మంగ స్తిమితంగా గుడిసెలో కూర్చో
లేకపోతూ ఉంది. అంతలోనే లేస్తుంది.
ఒక్క అడుగులో వీధిలో పడుతుంది.
అక్కడ నిలబడి ఆ కాలిబాట వైపు
కండ్లు చించుకొని చూస్తుంది.

ఆమె తాపత్రయం నిమిషాలతో పోటీ పడుతూ ఉంది - ఈనిన గొడ్డు మాదిర వీధిలోకి, ఇంట్లోకి.

ఎదురుచూడడం ఒక శిక్ష. అది అనుభవానికొస్తే గానీ తెలియదు.

ఎదురుచూసి ఎదురుచూసి మనసు విసిగి పోయింది. ఇంట్లోకి, వీధిలోకి తిరిగి తిరిగి కాళ్ళు కుక్కలు పీకినట్లు పీకుతున్నాయి. 'ఇంక నా వల్ల గాదురా బగమంతుడా' అంటూ కూలబడింది.

గుడిసింటి నడుమధ్య వెనుగాడి కొయ్యకు ఆధారంగా నాటిన నిట్రావు కొయ్య. ఆ కొయ్యకు చేరగిలబడింది. కాళ్ళు బారసాచింది. రెండు చేతులు పైకెత్తి ఆ కొయ్యను పొదివి పట్టుకొనింది. రెండు చేతులు పైకి లేచేసరికి పైట జారి ఒడిలో పడింది. నిట్టూర్పుల్తో ఎద ఎగిరెగిరిపడ్తూ ఉంది. చూపులు మాత్రం తదేకంగా వీధివైపు చూస్తున్నాయి.

మంగ మనసు పరిపరి విధాల పోతూ ఉంది.

'పొద్దు నడిమిట్టకొచ్చి రాకతాళకే నిలువెత్తు మోపు దెచ్చి గుడిసింటి గోడకు నిలేసే మొగలాయి ఇంట్లో మొగోడు. పొద్దు తిరిగిపోతా ఉండాది. కెలికిన నంకటి ఎండిపోతా ఉండాది. 'ఆకిలమ్మా ఆకిలి' అంటా ఏడ్సి ఏడ్సి పిల్లది రెండు దెబ్బలు తిని ఎట్టబొయ్యిందో పొయ్యింది. ఈ మణిసి ఇంకా రాలేదంటే? ఏఁవయ్‌పొయ్‌నాడబ్బా? కావిలోళ్ళ కంట్లో గాని పణ్ణాడా? పడుంటే వాళ్ళేం చేస్తారు? కత్తి పెరుక్కుంటారు. కాదుగీదంటే కేసు పెట్తా నంటారు. అయిదో పదో చేతిలో పడ్తే అలాగ్గా వొదిలేస్తారు. అట్టా మాదిర అయ్యుంటే గూడా మణిసి ఇయ్యేరవకే కొంప జేరుకోని ఉండాలగదా? ఏఁవయిందో ఏం పాడోనే? ఆ అడువుల్లో ఏ పుట్లో ఏ పాముంటుందో? ఏ పొదలో ఏంది మాటేసుంటుందో? చూస్తా కూసుంటే కట్టే కంపా కూడేసుకుండేదానికవితిందా? అట్టా జరగరాన్ది ఏఁవయినా జరిగిపొయ్యుంటే ఇంక ఈ కొంప గెతేం కావాల్రా బగమంతుడా?'

మంగ ఆ ఆలోచనతో తట్టుకోలేకపోయింది. ఉలిక్కి పడినట్టుగా పైకి లేచింది. లేస్తూ ఉంటే ఒడిలో పైట జారి నేలమీద పడింది. ఆ పైటను అందుకోవడానికి వంగింది. మెడలో వేలాడుతున్న మంగళసూత్రం కంటపడింది. కుడి చేత్తో మంగళ సూత్రాన్ని పట్టుకొనింది. ఎడమ చేత్తో పైట సర్దుకొంటూ మంగళసూత్రాన్ని కండ్ల కద్దుకొనింది. అద్దుకొంటూనే వీధిలోకి నడిచింది.

అక్కడ నిలబడింది. మంగళసూత్రాన్ని రెండు చేతుల్లో పెట్టుకొని ఒకసారి రెండు కండ్లకు అద్దుకొనింది. పైట చాటున దాచుకొనింది. తల పైకెత్తింది. రెప్పార్చకుండా కాలిబాట వైపు చూసింది. రెప్పలు వాలిపోయాయి. తల వాలిపోయింది. మంగ అడుగులో అడుగ్గా గుడిసెలోకి నడిచింది. గోడకు చేరగిలబడింది.

కట్టె గుడిసెలో. మనసు మగని చుట్టూ.

'ఏం బతుకులో పాడు బతుకులు. అట్టా చచ్చి నట్టూలే. ఇట్టా బతికినట్టూలే. దినగెండం నూరేండ్లా యుస్సుగా పోరకలాడాలంటే అది అయ్యే పనేనా? ప్చ్! దినమ్ము గంపకింద కోడిని నిద్రలేపతాడు. ముంతడు నీళ్ళతో మొకం కడుక్కుంటాడు. దోసెడు కూట్నీళ్ళల్లో పిడికెడు మెతుకులేసుకొని తిప్పి గొంతులో పోసుకొంటాడు. గంపకింద కోడి 'కొక్కరోకో' అంటా ఉంటే ముష్టికొయ్య మింద అంత ఇసిక పోసి కత్తి నూరుకుంటాడు. కుడి చేతిలో కత్తివాదరను ఎడమ చేతి బొట్నలితో తడిమి చూచుకుంటా ఎలబార్తాడు. పరవగుట్ట దాటుకొని...కాళంగుంట దాటుకొని గూటంకొండ కుప్పమిందికి పోతే గదా ఎండుకట్టెపుల్లలు. ఆడ మాత్రం వాసాలకంగా వాదెలు వాదెలుగా ఎవురు ఏరి పెట్టుంటారు, ఎత్తెత్తి మోపు గట్టుకుండే దానికి! చెట్టుకొగిటి... పుట్టకొగిటి... పొదకొగిటిగా ఏరుకుంటే గదా మోపు అవితింది.

**పెత్తందార్లు ఆడే మాయా నాటకాలను చూస్తే, దేవుడు జగన్నాటక సూత్రధారి కాదనీ, 'బెల్లం కొట్టిన రాయి' మాత్రమేనని అర్థమై పోతుంది. పేదోళ్ళ నోట నిజం ప్రాణాలకే చేటు.**

అట్టా మాదిర కన్నగసాట్లు పడి ఏరుకోవాల. లావూలంబుగా ఉంటే రెండు మూడుగా చీల్చుకోవాల. నుద్దంగా మోపు గట్టుకోవాల. ఆ మోపును నెత్తి కెత్తుకుంటే అది దోవా?... దోవకు పట్టిన పీడా? యాఁవార్తే ఏ ముల్లు పునక్కమని కాల్లోకి ఎక్కిపోతుందో? ఏ రాయి కాలికి తగిల్తిందో అని గుండికాయలు అర్చేతుల్లో పెట్టుకొని నడవాల. ఇన్ని అగసాట్లు బడి తెచ్చుకుంటే అవ్వి కూడు పెట్తాయా అంటే లేదే. ఈడ నుంచి మల్లా పేటకు మోసుకోని పోవాల. ఆడ దించమంటే దించాల. వద్దంటే నెత్తికెత్తుకోవాల. ఆడ ఎవురన్నా కష్టం తెల్సిన పుణ్ణాత్తుడు 'పోనీలే!' అనుకుంటే ఆ రూకల్తో నూకలు తెస్తే గదా చట్టీ పొయ్యి మింది కెక్కేదానికి! ఒక్క దినం అట్టా పాలుమాల్తే పొయ్యిలో పొణుకుండేదానికి పిల్లి నేనుండానంటింది. చీచీ! ఏం బతుకులో పాడు బతుకులు. ఇట్టా మాదిర బతుకులు బతికే దానికంటే బండ గట్టుకోని ఏ బాయిలో అయినా దూకి చావచ్చు. అయినా, ఇదేఁవి యిపరీతకాలఁవో ఏం పాడో? చేతికంత మట్టిగాకుండా బతికేవాళ్ళు బతికిపోతా ఉంటే, కన్నగసాట్లు పడ్తా ఉంటే కూడా ఈ జానడు కడుపు పూడనంటా ఉండాదే.'

గోడకు చేరగిలబడి ఆలోచిస్తా ఆలోచిస్తా మంగ అలానే నిద్రలోకి జారుకొనింది. నంకటి చట్టి చుట్టూ జుమ్మని ఈగలు మునురుతున్నాయి. ఆ చట్టి పక్కన్నే గోడమీద ఒక పెద్ద బల్లి. అమాంతంగా ఆ ఈగల్ని మింగేయాలన్నట్టుగా మిడిగుడ్లతో చూస్తూ ఉంది. గుడిసింటి ముందర మూడు పక్కలా మూడు బందారాకు తడికలు అడ్డంగా కట్టుకుంటే అది పెరడు. పక్కన్నే జలదారి గుంత. ఆ గుంతలో కప్పలు అరవలేక మూలుగుతున్నాయి. గుడిసింటి చూరును చూస్తూ ఉండిన పొద్దు గోడను చూస్తూ ఉంది. గోడకు చేరగిలబడిన మంగ తూగి తూగి పడ్తూ ఉంది.

'ఆ పొద్దు ఆళ్ళు నమ్మించి నా వేళ్ళతోనే నా కండ్లు

పొడవలా? ఈ పొద్దూ? వాళ్ళేళ్ళతో వాళ్ళ కండ్లే!... అంతే పెట్టాల్సిన చేట అగ్గి పెట్టేసినా. ఇంక పేలాల్సిన చోట్లో పేలిపోతింది.' ఒక్క ఊపులో గుడిసింట్లో దూరిన మాకడు కస్సుబుస్సుమంటున్నాడు.

మంగ ఉలిక్కిపడి లేచింది.

'ఈ దెబ్బతో ఆళ్ళ బండారం బయట పడిపోవాల. నలుగుర్లో తలెత్తుకోని తిరగలేకుండా మగ్గి మగ్గి చావాల. అప్పుడు నా కడుపు మంట చల్లారాల' అని తనలో తానే గొణుక్కుంటా మాకడు చేతిలో కత్తిని చూరులో దోపాడు. తలగుడ్డ విప్పి విదిలించి దండెం మీద వేశాడు. కాళ్ళూ చేతులు కడుక్కోవడానికి పెరట్లోకి నడిచాడు. మగని మాటలు అర్థం కాకుండా అయోమయంగా అతడి వైపు చూస్తూ కీ ఇచ్చిన మరబొమ్మలా గుడిసింటి వాకిట్లోకి వచ్చింది మంగ.

మాకడు ముంతలో నీళ్ళు ముంచుకొన్నాడు. మొగం కడుక్కొన్నాడు. కాళ్ళూ చేతులు కడుక్కొంటున్నాడు. మంగ గుడిసింటికి ఇటు పక్క, అటు పక్క కూడా చూసింది. కట్టెల మోపు కంట పడకపోయేసరికి కనుబొమ ముడిపడింది.

"చూడు చూడే! చూడు. తొంగి తొంగి చూడే. మొగుడితో నీకేం పనే? మోపుతోనే గదా." మొలకు యవ్వారం. తెచ్చేస్తే వండిపెట్టాల. అంత తిని కొంపలో పడుండాల."

"కొంపలో పడుండకుండా ఇప్పుడు నేనేం కోటలకు పేటలకు పరిగిత్తా ఉండానా? ఈదల మిందబడి ఊరేగతా ఉండానా? కండ్లల్లో నిద్దర కండ్లల్లో ఉండంగానే కాలు ఎలపెరుక్కోని పొయ్‌నాడే? ఆ అడువుల్లో ఏ పుట్టలో ఏ పురుగుంటిందో? ఏ పొదలో ఏది మాటేసుంటిందో అని నేను మల్లగుల్లాలు పడి చస్తా ఉంటే..."

"అవునవును గానీ... నా మొకానేఁవన్నా అంత సంకటో నలిబిండో కొట్టే పని ఉండాదా, లేదా?"

"అయ్యో నా రాత! మా మొకాన కొట్టుకుండాఁవనే గదా పొద్దు నడిమిట్టన ఉండంగానే సంకటి కెలికి పెట్టింది. ఈగిలు ముసర్తా ఉంటే చూస్తా కూసోనుండేది" అని యాష్టపోతూనే మంగ చట్టి మీద మూసిపెట్టిన మూకుడు తీసుకొనింది. దోసెడు నీళ్ళు పోసి మూడు చుట్లు తిప్పి పారచల్లింది. ఆ మూకుట్లో ముద్దసంకటి వేసింది. ఆ ముద్ద మీద ఒక్క అబక పుల్లగూర పోసింది. మగని ముందర పెట్టింది. ముంతతో నీళ్ళు ముంచి ఆ మూకుడు పక్కన్నే పెట్టింది.

బయట పడిపోతిందా? ఏందో ఈ మొగోడి కత అర్తం గాకుండా ఉండాదే' అని ఆలోచించుకుంటా కూతురుని వెదుక్కొంటూ ఊరిమీద పడింది.

పొద్దు గూట్లో పడింది.

* * *

"మాకా!...ఒరే మాకా!!"

నడిమిట్ట మీద సూర్యుడు అగ్గివడిపోతున్నాడు. గుడిసింటికి ఎదురుగా చింతచెట్టుకింద నిలబడిన అంకిరెడ్డి కండ్లల్లో అగ్గి కురుస్తూ ఉంది. పూనకం పూనినట్టు మనిషి వెనక్కూ ముందుకు ఊగిపోతున్నాడు. అతని నోటి నుంచి వెలువడిన పిలుపు కొత్త మొకాన్ని చూసిన కుక్క అరుపులా ఉంది.

మాకడు అంతకు ముందే అడవి నుంచి తిరిగి వచ్చాడు. మెడలు విరిగేటట్లు మోసి తెచ్చిన కట్టెల మోపును గుడిసింటి గోడకు ఆనించాడు. మెడలు విరుచుకొన్నాడు. తలమీదికి చుట్టగా మారిన చవకాన్ని చేతికి తీసుకొన్నాడు. విప్పి విదిలించాడు. భుజాన వేసుకొంటూ పెరట్లోకి నడిచాడు. ముంతలో నీళ్ళు ముంచుకొని కాళ్ళూ చేతులు, మొగం కడుక్కొన్నాడు. భుజాన చవకంతో మొగం తుడుచుకొంటూ గుడిసింట్లో

చిత్రాలు: నర్సిం



కట్టుకొన్న పంచెతోనే వంగి వంగి మొగం తుడుచుకుంటా మాకడు దెప్పిపొడిచాడు.

ఆ ఎత్తిపొడుపుతో మంగ మనసు బాధగా మూలిగింది. అంతవరకు తాను పడిన మథన మంట ముందు మైనంలా కరిగిపోయింది. రెప్పార్పకుండా మాకణ్ణి చూస్తూ నిలబడింది.

"ఇంట్లో మొగోడు యాడ చస్తే నీకేఁవి? యాడ చదరఁవైతే నీకేఁవే? నీక్కావాల్సింది కట్టెలమోపు. అంతేగదా."

"ఏందయ్యో నీ ఇష్టఁవొచ్చినట్టు నోరుపారేసుకుంటా ఉండావే? కోళ్ళను నిద్దర లేపి కొంప వొదిలి పెట్టి పొయ్‌నోడివి. మల్లా అవ్వి వొడిగేయాళ కాడ చేతులూగించుకుంటా కొంపకొస్తా ఉండావ్. సంకటి కెలికి చట్లో పెట్టేసి పొద్దు నడిమిట్ట కొచ్చింది మొదులుకోని నేను పణ్ణె తాపత్రం ఆ పరమాత్తుడికే ఎరిక. అది నీకేడ అర్తఁవయితిందిలే? అయ్యేటట్టుగా ఉంటే మీరు మొగోళ్ళు ఎట్టవతార్లే? అది సరేగానీ వాళ్ళేళ్ళతో వాళ్ళ కండ్లేంది?... వాళ్ళ బండారం బయటపడి పొయ్యేదేంది? ఏందయ్యో ఈ పొద్దు నీ కత నాకేఁవీ అర్తం కానంటా ఉండాదే?"

"ఉడుంకెందుకు ఊళ్ళో పెత్తానం అన్నెట్టుగా ఆడదానికెందుకే అడిగే పెత్తానం. ఆనరా దీసే మాకడు చారడులోకి ముంతలో నీళ్ళు వంచుకొన్నాడు. అరచేతిని తడుపుకొన్నాడు. సంకటి ముద్దను తుంచి పిడచ చేస్తున్నాడు.

"ఆకిలమ్మా ఆకిలి అని ఏడిస్తే గూడా పిల్లదానికంత సంకటి పెట్టకుండా పోతి. పాపిష్టిదాన్ని. ఏడ్సి ఏడ్సి అది యాడబడి నిద్దరపోతా ఉండాదో ఏం పాడో? పొయ్ చూసుకోనొస్తా. నువ్వు తింటా ఉండు. ముద్ద సంకటి తినేకుందికే వచ్చేస్తాలే. రాకుండా బోతే చట్లో ఉండే ఒక సంకటి ముద్దేసుకో. కూర చట్లో ఉండాది పుల్లగూర. అబకతో ఎత్తి అంతేసుకో. ఆడ ఎవురిమిందనో కోపం తిండి మింద చూపించబాక" అంటూ మంగ మగని మాట కోసరం ఎదురు చూడకుండా బయలుదేరింది.

చేతిలో పిడచ చేతిలోనే ఉంది. మాకడు ఒక్కసారి తల పైకెత్తి మంగవైపు చూశాడు. అదేమీ పట్టించుకోకుండా మంగ ఒడిసెల రాయిలా ముందుకు దూసుకొని పోతూ ఉంది. మాకడి చూపు మళ్ళీ సంకటి మీదికి మళ్ళింది. పిడచ పిడచగా తుంచి పుల్లగూరలో అద్ది గుటక్ గుటక్‌మని మింగుతున్నాడు.

మంగ గుడిసె దాటింది. గుడిసింటి వాకిలి దాటింది. వీధిలో అడుగుపెట్టింది. చకచకా నడుస్తూ ఉంది. 'వాళ్ళేళ్ళతో వాళ్ళ కండ్లా?... బండారం అడుగు పెట్టాడు. అప్పటికే మంగ మూకుట్లో వేసిన ముద్దసంకటి ఆవిర్లు కక్కుతూ ఉంది. తినడానికి కూర్చుంటున్నాడు. అంతలోనే అంకిరెడ్డి పిలుపు చెవిని పడింది.

కడుపులో చల్ల కదలకుండా నీడపాటున నిమ్మళంగా బతికే మనిషి అంకిరెడ్డి. అటువంటి మనిషి మాడు పగలకొట్టే ఎండలో తన ఇంటి ముందుకు రావడం... గుడిసిల్లు ఎగిరిపొయ్యేటట్లు అరవడం - మాకడు ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు.

"మాకా!... ఒరే... రారా బయటికి!"

మళ్ళీ అంకిరెడ్డి పిలుపు.

మాకడి గుండె గభీమనింది. దినాలు తిరగక ముందే కథ పాకాన పడుతున్నందుకు ఒక పక్క ఆనందంగా ఉన్నా ఇంకొక పక్క బెరుకు. అయినా, ప్రయోజనం? ఆవేశంలో ముందు వెనుకలు ఆలోచించకుండా అనుకొన్నంత పని చేసేశాడు. రోటిలో తలదూర్చి రోకటి పోటుకు వెరిస్తే?... అందుకే తెంపుగా పైకి లేచాడు. దర్జాగా చింతమాని కిందికి నడిచాడు. అంకిరెడ్డి ఎదురుగా నిలబడ్డాడు.

బాగా పండిన కొర్రకంకులా వంగి మడిచేతులు కట్టుకొని అడుగుమీద అడుగ్గా భయం భయంగా మాకడు తన ముందుకు వస్తాడనుకొన్న అంకిరెడ్డికి

ఆశాభంగమే అయింది. వాడు వచ్చిన వైనంతో అంకిరెడ్డికి ఆశ్చర్యం కలిగింది. అయినా, బయట పడకుండా రెప్పార్చకుండా వాడిమీద నిప్పులు కురిపిస్తున్నాడు.

"పిలిచింది ఎందుకో చెప్పు రెడ్డయ్యా?"

అంకిరెడ్డి చూపుల్లో మార్పు లేదు. ఊపులో కూడా మార్పు లేదు.

"ఎందుకు రెడ్డయ్యా అట్టా చూస్తా ఉండావే? చూపుల్తోనే కాల్చేసేదానికి నేనేం కొంగను కాదయ్యో. చెప్పు చెప్పు. పిలిచింది ఎందుకో చెప్పు?"

'ఒరే, నోరెత్తలేకుండా గిలగిల్లాడి చస్తాడనుకుంటే-కత శానాదూరం పోతా ఉండాదే?... ఇట్టయితే ఇంక లాబంలే. తాడో పేడో తేల్చుకోవాల్సిందే' అని ఒక నిర్ణయానికి వచ్చాడు అంకిరెడ్డి. నిర్ణయానికి రావడంతో తెపరాయించాడు, చింతమాని మీద కాకులు ఎగిరిపోయేటట్టు.

మాకడు చింతమానికి పట్టిన కావును గమనిస్తున్నాడు.

అంకిరెడ్డి అరికాలి మంట ఉచ్చికెక్కింది.

"ఎంత పని చేసినావురా!"

"రెడ్డయ్యా! ఇష్టంవొచ్చినట్టు నోరు పోరేసుకో బాక. ఎవురో ఏందో చేసేసినట్టు ఎగిరెగిరి పడ్తాఉండావే?... ఆ అంత పని చేసిందెవురు?"

"ఏం కూసినావురా?"

"నేనేంవో మరేదగానే మాట్లాడ్తా ఉండా. నోటికొచ్చినట్టు కూస్తా ఉండాది నువ్వే."

"ఒరే తక్కవ జాతోడా? ఎంత కాడికొచ్చినావురా?"

"నేనెందుకవతానయ్యా తక్కవ జాతోణ్ణి?... తప్పుడు కూతలు కూసేవోళ్ళూ... తప్పుడాట్లు ఆడేవోళ్ళూ తక్కవ జాతోళ్ళు అవతారు గానీ..."

"రే! ఏందిరా నువ్వనింది. ఇంకొకసారన్నా!"

"ఒక్కసారేం ఖర్మ... ఒగిటికి వదిసార్లంటా."

"నేను తక్కువ పన్లు చేసినాననా?"

"చేసినావో లేదో ఒకసారి గుండికాయి మీద చెయ్యిబెట్టి ఆలోచించుకోరాదా?"

"ఒరే, నాకేం కూటికి లేదా, గుడ్డకు లేదారా తక్కవ పన్లు చేసేదానికి?"

"రెడ్డయ్యా! తమరికి తెలపదని కాదు — కూటికి, గుడ్డకు లేనోళ్ళే మాటమింద బడి చచ్చేది. మానానికి హీనానికి ఎర్చేది. ఆమాటకొస్తే కూటికి, గుడ్డకు కలిగినోళ్ళే కోట్లకు పడిగెత్తాలని నానా అడ్డకూళ్ళూ కుడ్సేది. అయినా, అర్సేతికి అద్దమెందుకయ్యా? మనం చేసింది మనకు తెలస్తానే ఉండ్లా?"

"నేనేం చేసినాన్నా తప్పుడు ఎదవా?"

"తప్పుడు ఎదవా!... ఎవుడయ్యా?... తప్పుడు పన్లు చేసేవోడు. పోనీ! నువ్వేంవీ చెయ్‌లేదా? గోచిపేత పెట్టుకోని నీ కొంపలో బర్రెగొడ్ల మేపితి. నిక్కరేసుకోని అవుల ఎంట అడివికి పోతి. నాలుగు మూర్ల తుండుగుడ్డ మొలకు చుట్టుకోమని ఇసిరి నా మొకాన పారేసి మూడు బావుల కింద సేద్యం ఒంటిచేతికొప్పగిస్తివి. నా కండలు పిండితి. నా రగతాన్ని చెంవటగా మారిస్తి. నీ గాదెలు నింపితి. నువ్వేమో మేడమింద మేడ కట్టుకొంటివి. నీవోళ్ళు నీ చేతికిందికెదిగేకుందికి ఎనుకూ ముందూ చూడకుండా నన్ను మెడబట్టి బయటికి గెంటేస్తివి. 'పోరా పో! పాయ్ దిక్కుండే కోరట్లో దావా ఏసుకో పోరా!' అంటివి. దావా ఏసుకుండే సెగితే నాకు ఉణ్ణుంటేనా? హుంc! ఎందుకులే? అదట్టా పోనీ! రగతం పంచుకోని పుట్టిన నీ ఇంటి ఆడవడుచు ఆరు సవరాల బంగారు నాలుగుపేట గొలుసు తెచ్చి నీచేతి కిచ్చె. నీ కొడుక్కు తన కూతుర్ని చేసుకోమనె. నరేసనంటివి. చేతిలో చెయ్యేస్తివి. కండ్లారా చూస్తినే. అయినా, మాటమింద నిలబడ్తివా? కొడుకు ఒప్పుకోలేదంటివి. పోనీ! ఆంవె తెచ్చిచ్చిన గొలుసు ఆంవెకిచ్చేయాల గదా. నోరు తెర్సి అడిగితే ఏంవంటివి. ఏ గొలుసంటా అడ్డం తిరిగితివి."

"ఎవుడమ్మా మొగుడి సొత్తురా ఆ గొలుసు?"

"బలే చెప్పినావు రెడ్డయ్యా! నిప్పటుమంటిది గదా నిజం. అవుగదా మరి! ఎవుడమ్మా మొగుడి సొత్తు ఆ గొలుసు? అది తేల్చేదానికే గదా మద్దిస్తం పెట్టానంటా ఉండారు. పెట్టే ఆణ్ణే తేలిపోతింది గదా అది ఎవుడబ్బ సొత్తో? దానికి ఇప్పుడెందుకయ్యా ఈ కుంటి మద్దిస్తం? నువ్వు పద పద!"

అంకిరెడ్డి మాటకు ఎదురు చూడకుండా మాకడు గిరక్కున వెనక్కు తిరిగాడు. ఒక్క ఊపులో గుడిసింటి వైపు నడుస్తున్నాడు. అంతవరకు నీడనిచ్చిన చింతచెట్టే ఫెళ ఫెళా విరిగి నెత్తిన పడినట్లనిపించింది అంకిరెడ్డికి. ఒక్క క్షణం అక్కడ నిలబడలేకపోయాడు. తల పంకిస్తూ గుడిసింటి వైపు తీక్షణంగా ఒక్క చూపు చూశాడు. నిజానికి భుజాన్నిస్తున్నట్లు ఆ గుడిసె అంకిరెడ్డి కంటికి అంతై ఇంతై ఆకాశం ఎత్తుకు ఎదిగిపోతున్నట్లనిపించింది. అంకిరెడ్డి తల వాలిపోయింది. గుండె బరువెక్కింది. కోపం ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా మారింది. అడుగుమీద అడుగ్గా ఊళ్ళోకి నడుస్తున్నాడు.

> "నేనెందుకవతానయ్యా తక్కవ జాతోణ్ణి?... తప్పుడు కూతలు కూసేవోళ్ళూ... తప్పుడాట్లు ఆడేవోళ్ళూ తక్కవ జాతోళ్ళు అవతారు గానీ..."

మాకడు మూకుడు ముందు కూర్చున్నాడు.

"ఏంది మాంవా రెడ్డయ్యతో..."

"ఏందైతే నీ కెందుకే?

"మనబోటి పేదోళ్ళు కొండల్తో డీకొంటే అవ్వి కొండలు మాంవా! కదలవు. మెదలవు. వాడి మద్దెబడి మనంవే నలిగి చస్తాంవు."

"కదల్తాయో కదలవో, ఎవురు చస్తారో చూస్తా ఉండే!"

"నువ్వు ఉత్త బ్రెంవలో పడ్తాఉండావు మాంవా!"

"నువ్వు నోరు మూస్తావా, మూకుట్లో సంకటి ముద్దెత్తి మోకాన కొట్టమంటావా?"

ఆ మాటతో మంగ నోరు మూతపడింది. ముంతతో నీళ్ళు ముంచి మూకుడు పక్కన పెట్టింది. గుడిసింట్లో నిట్రావు కొయ్యకు ఆనుకొనింది. జరగపోయే పరిణామాలను బొమ్మకట్టుకోవడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ ఉంది. మాకడు సంకటి తినడంలో నిమగ్నుడయ్యాడు.

వాడు దొంగ కావచ్చు. దొర కావచ్చు. మోసగాడే కావచ్చు. ఎవడైనా కావచ్చు. ప్రతివాడికి ఒక అంతరాత్మ ఉంటుంది. అది ఎప్పుడో ఒకప్పుడు మేలుకొంటుంది. ఒకడి ప్రమేయం లేకుండానే నిజానిజాలను ధర్మకాటాలో పెడుతుంది.

అంకిరెడ్డి అంతరాత్మ మేలుకొనింది.

"ఒక తప్పుచేశావు. దానిని కప్పిపుచ్చుకోవడానికి ఇంకొక తప్పు చేస్తున్నావు."

"తప్పు చేసింది నేను కాదు."

"ఎవరు చేసినా తప్పు తప్పే! మీ చెల్లెలు తప్పు చేసింది. దానికి నువ్వు సహకరించావు."

"మా చెల్లెలు తప్పు చేసిందని నిజంగా నాకు తెలియదు."

"ఆ మాట నిజమే! ఆమె నాలుగుపేట బంగారు గొలుసు తెచ్చి నీ చేతికి ఇచ్చినప్పుడు అది దొంగ సొత్తని తెలియదు. ఆ తర్వాత తెలిసింది."

"అవును."

"కదా. ఆ సొత్తు కలవాళ్ళు ఎవరో కాదు. మీకు దగ్గర బంధువులే. మీ చెల్లెలి పక్కింటివాళ్ళే. ఆ ఇంటి కోడలు ముచ్చటపడింది. తన కొడుకు అయిదారేండ్ల పసిబిడ్డ. చూడ ముచ్చటగా ఉంటాడు. ముచ్చటపడి వాడికి చిన్నికృష్ణుడి వేషం వేసింది. తన మెడలో ఉన్న నాలుగు పేట బంగారు గొలుసు తీసి వాడి మెడలో వేసింది. వాడు ఆనందంతో అటు, ఇటు తిరుగుతూ మీ చెల్లెలి ఇంటికీ పోయాడు. మీ చెల్లెలి కన్ను ఆ గొలుసు మీద పడింది. ఆ పిల్లవాణ్ణి చేరదీసింది. తినడానికి వాడి చేతికి ఏదో ఇచ్చింది. ఎత్తుకొని ముద్దులాడుతూ మురిపించి మరిపించింది. గొలుసు కొట్టేసింది. లావు మీద వంపు తెలియదు కదా. సందేహానికి తావు లేకపోయింది. ఈ వాస్తవం ఆ తర్వాత తర్వాత తెలిసింది."

"తెలిసి ఏం ప్రయోజనం?"

"నువ్వు యోగ్యుడైతే వాళ్ళ సొత్తు వాళ్ళకే ఇచ్చేసేవాడివి."

"ఆ పని నేను చేస్తే నా చెల్లెలి పరువు ఏం కావాలి?"

"ఇప్పుడు నీ పరువు? ఇదంతా ఆ మాకడి వల్లనే కదా జరిగింది."

"మాకడికి నువ్వు అన్యాయం చేశావు."

"నేనేం వాడి భూములు, బావులు, వస్తు వాహనాలు దోచుకొన్నానా?"

"అవన్నీ వాడికే ఉంటే వాడెందుకు నీ ఇంటి సేద్యగాడవుతాడు? వాడి కష్టాన్ని నువ్వు దోచుకున్నావు."

"వాడు చేసిన కష్టానికి నేను పెట్టిన కూడూ గుడ్డకు సరిపోలేదా?"

"అదేనా నువ్వు వాడికిచ్చిన మాట?"

"......................."

"మాట తప్పినవాడివి, నువ్వేం మాట్లాడతావు. ఆ గొలుసు నీ చేతికి వచ్చినపుడు వాడు నీ ఇంట్లో ఉన్నాడు. దానికి వాడు సాక్షి. ఆ తర్వాత నువ్వు నీ మేనకోడలు సంబంధాన్ని కాదని గొలుసు ఇవ్వలేదని అడ్డం తిరిగినదానికి ఊరంతా సాక్షి. మాకడు ప్రతీకారం తీర్చుకోవడానికి వాడికొక మంచి అవకాశం దొరికింది. అవకాశం దొరికితే ఎవడు చేతులు ముడుచుకొని కూచుంటాడు? అవకాశం దొరికినపుడు కేవలం ఆరు సవరాల బంగారానికే నీ బుద్ధి గడ్డి తినింది కదా. అలాంటప్పుడు మాకడు చేసింది తప్పని ఎలా అంటావ్?"

"తప్పుకాదు. అయినా, ఈ ముప్పు నుంచి బయటపడాలి కదా."

"ఇంకెలా బయట పడతావ్? పదిమందిలో పడిన పాము చావదంటారుకానీ, నువ్వు మనిషివి."

"ఆ పదిమందిలో అంకిరెడ్డీ ఒకడా? కాడు. కాబోడు. అదే అంకిరెడ్డి ప్రత్యేకత."

ఆ భావనతో అంకిరెడ్డికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది.

తెంపుగా ముందుకు నడుస్తున్నాడు.

రెండు ముద్దల సంకటి రెండు నిమిషాల్లో లాగించినట్లు లాగించి మాకడు ఆ మూకుట్లోనే చేతులు కడుక్కొన్నాడు.

* * *

ఊరు మాటు మణుగుతున్న వేళ!

ఆ వేళప్పుడు రెండు చెంబుల వేడినీళ్ళతో ఒళ్ళు కడుక్కొని, ఉడుకుడుగ్గా అంత నోట్లో వేసుకొని, ఆదరాబాదరా పండిన చేనుల కావలికి కొందరు బయలుదేరుతుంటారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. వస్తే మడికయ్యలకో, తోటలకో తడి వేసుకోవచ్చునని బావుల దగ్గర శవజాగరణ చేయడానికి కొందరు బయలుదేరుతుంటారు. కానీ, ఆ పూట మాత్రం నిక్కుతూ నీలుగుతూ స్నానపానాదులు ముగించుకొని ఊరి నడిబొడ్డులో రాగిమాని కింద రచ్చబండ దగ్గరికి పెండ్లినడకలు నడుస్తున్నారు.

ఆ పొద్దు ఊళ్ళో మద్దిస్తం!

ఇంటికొక్క పెద్దతల తప్పకుండా మద్దిస్తానికి రావాలని మడివేలు మునిగాడు అదేపనిగా ఇల్లిల్లూ తిరిగి చెప్తున్నాడు.

మద్దిస్తం అంటే 'ముందు మాకు పొయ్యండి వసంతం' అనేవాళ్ళు మాత్రం అప్పటికే రచ్చబండ వద్ద చేరుకొన్నారు. రచ్చబండ మీద తీరుబాటుగా కూర్చొని ఆకు వక్క నమిలేవాళ్ళు నములుతూ.... బీడీలు కాల్చేవాళ్ళు కాల్చుతూ... ఆ రాత్రి జరగబోయే మద్దిస్తంపై ఊహాగానాలు చేసుకొంటున్నారు.

ఆ మధ్యాహ్నానికే పొరుగూరు నుంచి ఊరు చేరుకొన్న అంకిరెడ్డి కాలికి బలపం కట్టుకొని ఇల్లిల్లూ తిరిగాడు. తన తప్పు ఏమీ లేదంటూ నంగేడ్పులతో నమ్మించడానికి నానా తిప్పలు పడ్డాడు. ఎదుట పడిన ప్రతి వ్యక్తి చేతులు పట్టుకొని "ఇదేఁవన్నా నాయంగా ఉండాదా? ఆ తక్కవ జాతోడి మాటలు నమ్మి నన్ను రచ్చబండ కాడికీడస్తారా? పైన మండే వాడొకడుండ్లా? నా కడుపుమంట వాళ్ళకు ఎదక్కుండా పోతిందా " అంటూ ఏడుపు మొగం పెడ్తున్నాడు. ఎవరికి తోచినట్లు వాళ్ళు తలకొక విధంగా ఓదార్పు మాటలు చెప్తుంటే మద్దిస్తంలో గెలుపు తననే వరించినట్లు లేని ధైర్యాన్ని తెచ్చుకొన్నాడు. ఆ ధైర్యంతోనే మొగం చెల్లకపోయినా ధైర్యంగా చెల్లెమ్మ గడప తొక్కాడు.

"ఎప్పుడన్నా వచ్చింది" అంటూ గడప దగ్గరికే ఎదురుగా రావలసిన చెల్లెమ్మ చూసీచూడనట్లు ముభావంగా ఉండేసరికి అంకిరెడ్డి గుండెల్లో రాయి పడింది. అయినా, మనిషి తెపరాయించుకొన్నాడు. ఆమె రెండు చేతులు పట్టుకొన్నాడు. ఆ మొగాన్ని చూడలేనట్లుగా ఆమె తల వంచుకొనింది.

"చెల్లెమ్మా! ఇవ్వి చేతులు గాదు. నా మాట యినిపించుకో. జరిగిందేదో జరిగిపొయ్యింది. ఇప్పుడు అదెంతా తొవ్వి తలకెత్తుకుంటే ఒరిగి మిట్టన పడబొయ్యేదేముండాది? నువ్వు గెట్టిగా నిలబడకపోతే ఇద్దరి బతుకులు ఈదిపాలవతాయి."

ఒక్కసారి తల పైకెత్తి అన్న మొగంలోకి నిశితంగా చూసింది చెల్లెమ్మ!

"ఈ మాట అడిగేదానికి నోరెట్లా వచ్చింది" అన్నట్లుందా చూపు.

"బుద్ధి గెడ్డి తినింది. ఇదెంతా మీ వదినె చేసిన పని."

చెల్లెమ్మ మళ్ళీ తలవంచుకొనింది.

"జరిగిందంతా మణుసులో పెట్టుకోని నువ్వు నోరు జార్తే మల్లా నేను ఊళ్ళో అడుగు పెట్టాల్సిన పనే లేదు. ఈ ఊళ్ళోనే ఏ బాయో గుంటో చూసుకుంటా."

మళ్ళీ ఒకసారి తల పైకెత్తి అన్న మొగంలోకి చూసింది చెల్లెమ్మ. ఆమె కండ్లల్లో నీళ్ళు తిరిగాయి. అయినా, తమాయించుకొనింది.

"ఆ పిలగాడి మెడలో గొలుసు నేను తాకలేదంటే తాకనేలేదని నువ్వు గెట్టిగా చెప్పు. చాలు. మిగత కతంతా నేను నడిపిస్తా."

ఆమె తల వాలిపోయింది. మెల్లగా చేతులు విడిపించుకొనింది. అడుగుమీద అడుగ్గా వంట ఇంట్లోకి నడిచింది. చెంబుతో దాహానికి నీళ్ళు తెచ్చి అన్న చేతికిచ్చింది.

అంకిరెడ్డి గుండె కుదుటపడింది.

రచ్చబండ వద్ద ఆ రాత్రి జరుగుతున్న మద్దిస్తాన్ని గురించి రకరకాలుగా ఆలోచించుకొంటూ ఉంటే ఆ ఇంట్లో అంకిరెడ్డికి క్షణం ఒక యుగంగా గడుస్తూ ఉంది.

"రెడ్డయ్యా! పెద్దమణుసులంతా రచ్చబండ కాడి కొచ్చేసినారు" అని జాము రాత్రప్పుడు మడివేలు ఎలుగు ఇవ్వడంతో అంకిరెడ్డి ఈ లోకంలో పడ్డాడు. చెల్లెమ్మను వెంటబెట్టుకొని రచ్చబండ వద్దకు బయలుదేరాడు. వాళ్ళు రచ్చబండను చేరుకొనేసరికి అక్కడ అప్పటికే కోలాహలంగా ఉంది.

ఆరు సవరాల బంగారు గొలును పోగొట్టుకొన్న ఇల్లు మాకడిని ఆ పూట బంగారు కొండలా చూసుకున్నది. వాడు అతిథి మర్యాదలతో ఉక్కిరి బిక్కిరి అవుతూంటే తీసుకొనివచ్చి రచ్చబండ వద్ద నిలబెట్టారు.

పున్నమినాటి ముందురోజు. పండు వెన్నెల పుచ్చ



పూసినట్లుంది. రాగిమాని ఆకుల సందుల్లో నుంచి పొడలు పొడలుగా రచ్చబండ మీద కూర్చున్న పెద్దమనుషుల మీద పడుతూ ఉంది.

"ఎంత నంగనాచి టంగుబుర్రమ్మా? నోట్లో ఏలు పెట్తే కొరికితిందా అనిపిస్తా ఉండె. అయినా, ఎంత పని చేసిందమ్మా?"

"కర్చే కుక్కలు ఎప్పుడూ మొరగవు."

"పోనీ కూటికి లేదా? గుడ్డకు లేదా? అంత కక్కుర్తి పడేదానికి!"

"మంచోడి బుద్ధి మాంసం కాడ తెలిస్తిందన్నోట్లుగా ఆ పాడు దుడ్లుండాయే అవ్వి అంతే. మణిసిని ఏకాడికైనా పగదెగిపిస్తాయి."

"అవును. శాస్త్రాలు చూపించిరి. చెప్పు నగిణాలు చెయ్‌పించిరి. దానిమింద ఎవ్వుడూ గుమానుపళ్ళేదే?"

"అప్పుడా పిల్ల ఊళ్ళో యాడుండె. పుట్టింటికి పొయ్యుండ్లా? లావు మింద వొంపు తెల్దని దాని మింద ఎవురూ సందేహపళ్ళా."

"ఊళ్ళో పేడముద్దల తంతు కూడా జరిపించిరి గదా! ఇంటింటికీ ఒక పేడముద్దను కూడా తెమ్మనిరి గదా! అప్పుడైనా ఆ పేడముద్దలో తెచ్చిపారేసుంటే?..."

"అదెప్పుడో చేతులు మారి అన్న ఇంటికి చేరిపోతే- నువ్వు చెప్పేది బలే బాగుండాదే. అది పేడ ముద్దలోకి ఎట్టొస్తిందీ?"

మద్దిస్తంలో ఏమి తేలుతుందో విందామని ఇంటి వాకిట గడపల్లో కూర్చున్న ఆడంగులు తలకొక విధంగా మాట్లాడుతున్నారు.

"ఏఁవిరా మాకా? ఏఁవి చెప్తావ్‌రా?" పినపెద్ద నోరు విప్పడంతో సద్దుమణిగింది.

"చెప్పేదానికి ఇంకేఁవుండాదయ్యా? చెప్పాల్సింది నేనెప్పుడో చెప్పేసినా. నా ఒక్క బిడ్డ సాచ్చిగా చెప్తా ఉండా. నాలుగుపేట గొలును తెచ్చి నా కండ్ల ముందర్నే ఆఁవె అన్న చేతికిచ్చింది."

"అవును, ఇది జరిగి అయిదారేండ్లు అయ్‌పాయ గదా! ఇన్ని దినాలుగా నువ్వెందుకు చెప్పలా?"

"అది దొంగసొత్తని నాకు మాత్రం ఎట్ల తెలునయ్యా? అప్పచెల్లె తెచ్చి అన్నదమ్ముడి చేతికిస్తా ఉండాదనుకుంటి. నిన్నగాక మొన్న కూతుర్ని కొడుక్కు చేసుకుంటానని చెప్పి చేసుకోలేదని, కట్నంగా ఇచ్చిన గొలును అడిగితే లేదన్నాడని ఈదిలో పాడి పాడి ఏడస్తా, 'ఒకర్ని నేను గెబీమనిపిస్తే దేవుడు నన్ను గెబీమనిపించె' అంటూ ఉంటే గదా అనలు కత అర్థమాయ."

"నువ్వేమంటావ్ అంకిరెడ్డీ!"

"ఆ తక్కవ జాతోడి మాటలు మీరు నమ్మతా ఉండారా?"

"వాడు నీ ఇంట్లో సేద్యగాడుగా ఉండె గదబ్బా?"

"ఉండె. ఇప్పుడు నా తలకాడ గుండాయ. సేద్యానికి వద్దన్నానని ఆడు కతలల్లి చెప్తా ఉంటే, మీరు నమ్మతా ఉండారు. అప్పటికి మీరంతా అనేది దానికి కూటికి లేదని, గుడ్డకు లేదని, ఇట్టా కక్కుర్తి పడిందని.

దొంగతనం చేసి బతకాల్సిన కర్మ దానికేం బట్టింది? పోనీ, చేసి దాన్ని తెచ్చి నా చేతికియ్యాల్సిన అగత్తెం ఎందుకు కలిగింది?''

''మాకడట్టా, అంకిరెడ్డి ఇట్టా? ఇంక ఎట్ట చెయ్యాలబ్బా?''

''ఎట్ట చెయ్యాలబ్బా అంటే? - పోలీసు కంప్లీటు ఇచ్చేస్తే కల్లె వొంపు పొయ్యి తీర్చినట్టయితింది.'' ఒక పెద్దతల నలహా ఇచ్చింది.

''అయితిందబ్బా అయితింది. దానివల్ల ఎవుడికేఁవి లాబం? అట్లనుకుంటే ఊళ్ళెందుకు, ఊళ్ళల్లో ఈ మద్దిస్తాలెందుకు? పోలీసు కంప్లీటంటే ఇంట్లో వుండెత్తి ఈదిలో పెట్నట్టే గదా! ఈళ్ళు పనీపాటా వొదులుకోని టేసిన్ చుట్టూ తిరగాల. తిరిగి తిరిగి ఈళ్ళకు బతుకు చావు జంపులు కావాల. అప్పుడు పోలీసోళ్ళే ఆ నగను మట్టనంగా చుట్టుకోవాల.'' పినపెద్ద ఆ నలహాను తిప్పికొట్టాడు.

''అయితే, ఇప్పుడేం చెయ్యాల?''

''ప్రెమాణం చెయ్‌పిస్తే?''

''ఎక్కడ ·చెయ్‌మనాల?''

''ఆడా ఈడా ఎందుకు? కాణిపాకం యినాయకుడి గుళ్ళో చెయ్‌పిస్తే ఇంక దానికి తిరుగు మరుగు ఉండదు. కోరట్లో గూడా అప్పీలుండదు.''

''అయితే, ఎవురు ప్రెమాణం చెయ్యాల?''

''ఎవురు చెయ్యాలంటే?.... పిలగాడి మెళ్ళో గొలును నేను తీసుకోలేదని ఆ అమ్మి ప్రెమాణం చెయ్యాల.''

''మాకేం గాచ్చారంబట్టిందయ్యా ప్రెమాణం చేసేదానికి? వాడెవుడో దారినబొయ్యేవోడు మా మింద నింద మోపితే, మేము దానికి నత్తె ప్రెమాణాలు చెయ్యాల్నా? ఏఁవి నాయమయ్యా మీ నాయం? అట్టయితే మా చెల్లె గొలును దొంగిలించిందని వాళ్ళనే ప్రెమాణం చెయ్యమనండి.''

''ఇది మరీ బాగుండాదే? మీ చెల్లె గొలును కొట్టేసిందని మేమేఁవన్నా కలగన్నామా? కండ్లారా చూసినామా? మాకడు మాతో చెప్పె. మేము పాలన్నం తినే పదిమంది పెద్దమణుసులకు చెప్తా ఉండాం. నువ్వు మాట్లాడేది నాయంగాదు అంకిరెడ్డీ.''

''వాళ్ళట్టా, మీరిట్టా? ఇంకెవురు చెయ్యాలబ్బా?''

''ఎవురు చెయ్యాలంటే మాకడే చెయ్యాల!''

''ఏఁవిరా మాకా?''

''నాకేం అబ్బెంతరం లేదయ్యో? మీరు యాడ చెయ్యమంటే ఆడ చేస్తా.''

''ఒరే కుండాకోర్! యాడికి తెగించినావురా. మా చెల్లి దొంగతనం చేసింది నువ్వు చూసినావురా?''

''రెడ్డయ్యా! పదిమంది పెద్దమణుసుల ముందర ఇష్టఁవొచ్చినట్టు నోరు పారేసుకోబాక. మీ చెల్లెమ్మ దొంగతనం చేసిందో లేదో నాకు తెల్దు. ఆ గొలును మాత్రం నీ ఇల్లు చేరింది. నన్ను యాడ ప్రెమాణం చెయ్యమంటే ఆడ చేస్తా.''

''రే! ఏం కూసినావురా?''

''అంకిరెడ్డీ! మీరిద్దురే వాదులాడుకుంటానంటే నడిమిద్దె పెద్దమణుసులెందుకయ్యా?''

''లేకుంటే చూడండి!''

''నువ్వు వాడికెందుకు నోరిస్తావే? మేఁవు ఉండాం గదా!''



**పదిమంది పెద్దమనుమల ముందు వాడు చెప్పిందీ నిజం; ఆ నిజం నెత్తురు కక్కి చచ్చిందీ నిజం! దీనికి ఎవరు సాక్షి?**

''మీతో ఏం మాట్లాడమంటారు? మాట్లాడ్తే ప్రెమాణం చెయ్‌మంటారు.''

''అంతేగదా? చేస్తే నువ్వయినా చెయ్యాల. లేకపోతే వాడైనా చెయ్యాల.''

''వాడికేం? అన్నిటికి ఇడ్సేసినోడు. ఏం చెయ్‌మన్నా చేస్తాడు.''

''నువ్వు చెప్పేది బలే బాగుండాదే? వాడికేం పెండ్లాం బిడ్డెలు లేరా? బతుకుమింద ఆశ లేదా? కాణిపాకం యినాయకుడి గుడికాడ ప్రెమాణం చేసేదంటే నటపటమైన పనా? చెప్పు. నువ్వు చేస్తావా, వాణ్ణే చెయ్‌మంటావా?''

పరిస్థితి కాణిపాకం వినాయకుడి గుడి వరకు వస్తుందని ఊహించని అంకిరెడ్డి ఎటూ చెప్పలేక నీళ్ళు నములుతున్నాడు. ప్రమాణం చేస్తే ఎలా, చేయకపోతే ఎలా అని తనలో తాను మల్లగుల్లాలు పడ్తున్నాడు.

''తప్పు చేసినోడయ్యా ఆలోచిస్తాడు. లేనోడు ఎందుకాలోచిస్తాడు?''

ఎవరో కొట్టాల్సిన చోటనే కొట్టే, అది తగలాల్సిన చోటనే తగిలింది.

''అవునవునయ్యా! నేను తప్పు చేసినాను. ఆ తక్కువ జాతోడిని అడ్డం పెట్టుకోని మీరు నన్ను ఆట పట్టించాలని చూస్తా ఉండారు.''

''అంకిరెడ్డీ! అడ్డం పెట్టుకుండేదేంది, ఆట పట్టించేదేంది? అప్పిటికి వాడు మాకు బొడ్డు కింద చుట్టం, నువ్వు కాదో? అదెంతా కాదు. నాయం ఎట్టుంటే అట్నే. మాకడు కాణిపాకం యినాయకుడి గుళ్ళో ప్రెమాణం చేస్తాడు. నువ్వు వాళ్ళ సొత్తు వాళ్ళకు ఇచ్చేయాల్సిందే. ఏఁవిరా మాకా?''

''నేను ఈ పొద్దయినా రెడీ! రేపైనా రడీ... మీరెప్పుడు చెప్తే అప్పుడు.''

''ఒరే, తక్కువ జాతోడా! చెయ్‌రా! ప్రెమాణం చెయ్. అబం సుబం ఎరగనోడి మింద అపనింద మోపతా ఉండావ్. ఇంత అన్నాయానికి దిగినోణ్ణి ఆ కాణిపాకం యినాయకుడే చూసుకుంటాడు. ఆ దేముళ్ళో సత్తెముంటే నేను చెప్తా ఉండా యిను. ఆ దేముడి ముందరే నువ్వు రగతం కక్కి చావకపోతే...''

''అంకిరెడ్డీ! ఎందుకట్లా నోరు పారేసుకుంటావే? ఉప్పు తిన్నోడు నీళ్ళు తాగాల్సిందే. తప్పదు. తప్పు చేసినోడు తప్పకుండా అనబవిస్తాడు. ఈ పొద్దు ఆదివారం కదా. పై వొచ్చే ఆదివారం మాకడు కాణిపాకం వినాయకుడి గుళ్ళో ప్రెమాణం చేస్తాడు. నువ్వు వాళ్ళ సొత్తు వాళ్ళకిచ్చేయాల్సిందే. ఇది పదిమంది పాలన్నం తినే పెద్దమణుసుల తీర్మానం!...''

పినపెద్ద తీర్పు చెప్పాడు. సాధారణంగా ఆ మార్పుకు తీర్పు ఉండదు. అప్పటికే చుక్క నడిమిట్ట కొచ్చింది. 'శానా రేత్రి అయ్‌పొయ్యిందే' అనుకుంటా ఎవరి దారిన వాళ్ళు ఇల్లు చేరారు.

ఆ రాత్రి అంకిరెడ్డికి కంటి మీద రెప్ప పడితే ఒట్టు.

అంకిరెడ్డికి కంటిమీద రెప్ప పడలేదని కాలం ఆగదు కదా. ఆ రోజు తెల్లవారింది. మనిషి తన సౌకర్యం కోసరం ఆ దినానికి పెట్టుకొన్న పేరు సోమవారం. సోమవారం తెల్లవారినట్లే మంగళ, బుధ వారాలు కూడా తెల్లవారాయి. అయితే, గురువారం తెల్లవారేసరికి ఊరు గుప్పు మనింది.

మాకడు కాణిపాకం వినాయకుడి గుడి ముందు రక్తం కక్కి చచ్చిపడి ఉన్నాడట!

''చూసినారా! చూసినారా! నా మింద నింద మోపితే వాడి గెతి ఏఁవయిందో చూసినారా? కాణిపాకం యినాయకుడంటే ఏఁవనుకుణ్ణారు? మహన్నబావుడికి ఎవుర్నెట్టా శిచ్చించాల్నో వాడికే తెలుసు. ఆ తక్కువ జాతోడిని అడ్డం పెట్టుకోని నన్నొక ఆట పట్టించాలనుకుంటే బగమంతుడు ఓరస్తాడా?'' అంకిరెడ్డి నిలిచిన చోట నిలవకుండా ఊరంతా తిరిగి ఎలుగెత్తి చాటుతున్నాడు.

అంకిరెడ్డి చెల్లెలు ఫసిబిడ్డ మెడలో గొలును అపహరించింది నిజం.

ఆ గొలునును అన్న అంకిరెడ్డి చేతికి ఇచ్చిందీ నిజం.

ఇన్నున్నప్పుడు మాకడు కండ్లారా చూసింది నిజం.

పదిమంది పెద్దమనుమల ముందు వాడు చెప్పిందీ నిజం.

ఆ నిజం నెత్తురు కక్కి చచ్చిందీ నిజం!

దీనికి ఎవరు సాక్షి?

కాణిపాకం వినాయకుడి సాక్షిగా వాడే సాక్షి! ■